క్లుప్తంగా

తహసీల్దార్‌గా వీరవసంతరావు

పొదలకూరు: మండల తహసీల్దార్‌గా కె.వీరవసంతరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బాపట్ల జిల్లా రేపల్లెలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడికి అడహక్ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. తిరుపతి జిల్లా పెళ్లకూరు అడహక్ తహసీల్దార్ రామయ్యను పొదలకూరుకు బదిలీ చేసినా పాలనాపరమైన కారణాలతో దానిని రద్దు చేశారు. వీరవసంతరావును రెవెన్యూ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

వాటర్ ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నాం

కొడవలూరు: మంచినీటి సరఫరా ట్యాంక్‌లను తరచూ శుభ్రం చేయిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.రమేష్ తెలిపారు. కొడవలూరులోని ట్యాంక్‌లను పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ పారిశుద్ధ్య కార్మికులతో శుక్రవారం శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమాన్ని ఏఈ పరిశీలించారు. ఏ తేదీల్లో ట్యాంక్‌లను శుభ్ర పరిచారన్న విషయాన్ని పంచాయతీలోని నోటీస్ బోర్డుపై ప్రకటించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వి.నాగరాజు, ఇంజినీరింగ్ సహాయకులు శ్యామ్, పీడబ్ల్యూఎస్ ఆపరేటర్ తిరుపతయ్య పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకాల ప్రదానం రేపు

నెల్లూరు(బృందావనం): నగర పరిధిలోని కార్పొరేషన్, జెడ్పీ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన 37 మంది విద్యార్థులకు రూ.ఐదు వేల చొప్పున ప్రోత్సాహక బహుమతిని ఆదివారం సాయంత్రం అందజేయనున్నామని టౌన్‌హాల్ ట్రస్ట్ బోర్డు సెక్రటరీ జేఎస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని పురమందిరంలో నిర్వహించనున్నామని చెప్పారు.

గంజాయి విక్రయాలపై సెబ్ దాడులు



నిందితులతో ఎస్‌ఈబీ అధికారులు

నెల్లూరు(క్రైమ్): గంజాయి విక్రయాలపై ఎస్‌ఈబీ అధికారులు దాడులు జరిపి నలుగుర్ని అరెస్ట్ చేశారు. ఎస్‌ఈబీ అధికారుల సమాచారం మేరకు.. కపాడిపాళెంలో జహీరాబీ, స్రవంతి ప్రియ, సువర్ణ ప్రకాష్, హరిబాబురెడ్డి కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. దీనిపై ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి ఫిర్యాదులు అందాయి. ఆయన ఆదేశాల మేరకు ఏఎస్పీ హిమవతి పర్యవేక్షణలో ఎస్‌ఈబీ నెల్లూరు – 1 ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఎస్సై శ్రీనివాసరావు తదితరులు గురువారం అర్ధరాత్రి దాడి చేశారు. విక్రయదారులను అరెస్ట్ చేసి వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని విచారించగా, మరో ఐదుగురు నిందితుల వివరాలను వెల్లడించారు. వీరి కోసం గాలిస్తున్నామని అధికారులు తెలిపారు.

బైక్ చోరీ

నెల్లూరు(క్రైమ్): మోటార్‌బైక్ చోరీకి గురైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. లేక్‌వ్యూ కాలనీ ఐదో వీధిలో నివాసం ఉంటున్న రాజశేఖర్ తన పల్సర్ బైక్‌ను ఇంటి ముందు ఈ నెల 13వ తేదీ రాత్రి పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం బైక్ కనిపించలేదు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జీజీహెచ్‌లో వైద్య శిబిరం



నెల్లూరు (వేదాయపాళెం): నగరంలోని జీజీహెచ్ ఆవరణలో ఉచిత కేన్సర్ వైద్య శిబిరాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ, గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ జాషువా డానియెల్ మాట్లాడారు. కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాలను మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వింజమూరు, నెల్లూరు, కావలి కేంద్రాల్లో ఉచిత కేన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్ధానాయక్, తదితరులు పాల్గొన్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సాయం

నెల్లూరు(బృందావనం): నిరుపేద ముస్లిం యువతి వివాహానికి 48వ డివిజన్ పొర్లుకట్టలోని బదర్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో రూ.5500 ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. మసీదులో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకుడు హాఫీజ్ ఖలీల్ అహ్మద్, కరీముద్దీన్ సాహెబ్, యాకూబ్ సాహెబ్, జాఫర్‌జాన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తాం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలకిచ్చిన హామీలను సంపూర్ణంగా నెరవేరుస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. గడప గడపకు కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు సంబంధించి నాలుగేళ్లలోనే 99 శాతం మేర నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మిగిలిపోయిన సమస్యలుంటే తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో సర్వేపల్లి నియోజకవర్గంలో ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందన్నారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు మండలాల వారీగా అధికారులతో సమావేశాలను నిర్వహిస్తూ వారికి తగిన ఆదేశాలు ఇస్తున్నామన్నారు.

చుక్కల భూముల సమస్యలకు పరిష్కారం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో చేపడుతున్న రెవెన్యూ సదస్సులు సత్ఫలితాలిస్తున్నాయని మంత్రి కాకాణి చెప్పారు. చుక్కల భూములు, అసైన్‌మెంట్ భూముల సమస్యలను పరిష్కరిస్తూ అనుభవదారులకు పట్టాలిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. అనంతరం వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలను మంత్రి స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యులు ఎంబేటి శేషమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, నాయకులు కావల్‌రెడ్డి రంగారెడ్డి, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, తలమంచి సురేంద్రబాబు, మన్నెం చిరంజీవులగౌడ్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

జొన్నవాడలో ప్రత్యేక కౌంటర్ ప్రారంభం



కౌంటర్‌ను ప్రారంభించిన చైర్మన్ తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ నిత్యాన్నదానం కోసం దాతలు ఈ ప్రత్యేక కౌంటర్‌లో విరాళాలను అందించాలని కోరారు. ఇప్పటి వరకు విరాళాలను దేవస్థాన అధికారి కార్యాలయంలో తీసుకునేవారని చెప్పారు. ఇకనుంచి కొత్త కౌంటర్‌లో స్వీకరిస్తారన్నారు. అనంతరం కౌంటర్ వద్ద అమ్మవారి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ, అర్చకులు పాల్గొన్నారు.

జల్సాల కోసం చోరీలు, గంజాయి విక్రయం

- ముగ్గురు వ్యక్తుల అరెస్ట్



మాట్లాడుతున్న డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, ఎస్సై శివకృష్ణారెడ్డి

ముత్తుకూరు: వారంతా స్నేహితులు. దొంగలుగా మారారు. ఇంకా గంజాయి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముత్తుకూరు పోలీసులు ముగ్గురు వ్యక్తులను చాకచక్యంగా పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, ఎస్సై శివకృష్ణారెడ్డి వివరాలు వెల్లడించారు. నెల్లూరుకు చెందిన కంచు సురేష్, బుజ్జా శ్రీలేష్, గుండ్రాతి సిద్ధూ, పోలాని కిశోర్ స్నేహితులు. చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో చోరీలు చేయడం ప్రారంభించారు. మనుబోలు, పొదలకూరు, కొడవలూరు, ఇందుకూరుపేట మండలాల్లోని పలు ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. ఇటీవల జైలు నుంచి విడుదలైన ముత్తుకూరు మండలానికి చెందిన అరవ వినోద్ కూడా వారితో కలిసి పాట్టింపాడు, దుత్తపాడులో చోరీలు చేశాడు. నెల్లూరులో గంజాయి కొనుగోలు చేసి, ఎక్కువ ధరకు అమ్మకాలు చేయడం అలవాటు చేసుకున్నారు. అడిషనల్ ఎస్పీ హిమవతి పర్యవేక్షణలో పోలీసులు సీఐ వేమారెడ్డితో కలిసి గాలింపు చేపట్టారు. గురువారం సాయంత్రం వారంతా మోటార్‌బైక్‌లపై వస్తుండగా బ్రహ్మదేవి వద్ద పట్టుకునేందుకు ప్రయత్నించారు. సిద్ధూ, శ్రీలేష్, వినోద్ మాత్రం దొరికారు. సురేష్, కిశోర్ పరారయ్యారు. నిందితుల నుంచి రూ.70,000 నగదు, మూడున్నర కిలోల గంజాయి, 2 సవర్ల బంగారు ఆభరణాలు, రెండు మోటార్‌బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అనంతరం కోర్టుకు హాజరుపరిచారు.

పొదుపు మహిళలకు బ్యాంకు రుణాలు

- మెప్మా పీడీ రవీంద్ర



మహిళకు నగదు అందజేస్తున్న పీడీ రవీంద్ర

బుచ్చిరెడ్డిపాళెం: జగనన్న లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకుంటున్న పొదుపు సంఘాల మహిళలు బ్యాంకులు ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ రవీంద్ర సూచించారు. స్థానిక బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కో లబ్ధిదారుకు రూ.35 వేల రుణం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని ఇంటి నిర్మాణం కోసం వినియోగించుకోవాలన్నారు. దీనిపై మెప్మా సీఎంఎం, సీఓలు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం పలువురికి బ్యాంకు రుణాల కింద నగదును అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది అంకయ్య, సుధాకర్, నర్మద పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు ఘన సన్మానం



కోవూరు : విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం



వెంకటాచలం : ప్రతిభ చూపిన విద్యార్థులతో అధికారులు, టీచర్లు

కోవూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి జగనన్న ఆణిముత్యాల పేరుతో కోవూరు బాలికోన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ప్రతిభా అవార్డులు అందజేశారు. డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి ముఖ్యఅతిథులుగా విచ్చేసి మాట్లాడారు. ప్రథమ స్థానంలో ఎస్‌కే మొబీనా సుల్తానా (586 మార్కులు, కోవూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల), రెండు, మూడు స్థానాల్లో బుచ్చిరెడ్డిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్‌కే రెహాన్ (583 మార్కులు), సాయిచందన (582 మార్కులు) నిలిచారు. వీరికి సర్టిఫికెట్లు, నగదు అందజేశారు. అలాగే గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్‌కే మొబీనా సుల్తానాకు రాధాకృష్ణారెడ్డి, విజయలక్ష్మి దంపతులు రూ.50 వేలు ఇచ్చారు. అలాగే ఇంటర్‌లో ప్రతిభ చూపిన వారికి నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో బుచ్చి, కోవూరు ఎంఈఓలు రహీం, దిలీప్, మండల ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం నరసింహామూర్తి పాల్గొన్నారు.

కోవూరు జెడ్పీహెచ్‌ఎస్ పేరు మార్పు

బాలికోన్నత పాఠశాల పేరును పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా నామకరణం చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని హెచ్‌ఎం నరసింహామూర్తి తెలిపారు. రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ పేరు మార్పుకు మల్లికార్జునరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

పోటీతత్వంతో చదవాలి

వెంకటాచలం: విద్యార్థులు పోటీతత్వంతో చదివితే మంచి ఫలితాలు వస్తాయని బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటయ్య అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని గొలగమూడిలో ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ బాలికల గురుకులంలో శుక్రవారం ఉదయం విద్యార్థులకు సన్మానం చేశారు. పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన పూజిత, గ్రీష్మిత, నందినికి రూ.3వేలు, రూ.2వేలు, రూ.1,000 నగదు బహుమతులతోపాటుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.కొండల్‌రావు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మనుబోలు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మనుబోలు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కలికి సుధీర్‌రెడ్డి మోటార్‌బైక్‌పై నెల్లూరుకు బయలుదేరాడు. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆగి ఉన్న ట్యాంకర్‌ను బైక్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో సుధీర్ ముఖంపై తీవ్ర గాయమైంది. అతడిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తొలుత నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.54 లక్షలతో గర్భాలయానికి ఇత్తడి రేకులు



అమ్మవారిని దర్శించుకున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయ గర్భాలయంలోని గోడలకు సుమారు రూ.54 లక్షలతో ఇత్తడి రేకులను ఏర్పాటు చేసి బంగారు పూత వేయించనున్నట్లు ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. దాతలతో కలిసి శుక్రవారం గర్భాలయ గోడలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవతో నెల్లూరుకు చెందిన పీడూరు శంకర్‌రెడ్డి, ప్రణస్మిత దంపతులు అమ్మవారి గర్భాలయ గోడలకు సుమారు 350 కేజీల ఇత్తడి రేకులను ఏర్పాటు చేసి వాటిపై బంగారు పూతను వేయించేందుకు ముందుకొచ్చారని తెలిపారు. నెల్లూరుకు చెందిన సీఎంఆర్ షాపింగ్ మాల్ యజమాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పనులు జరుగుతాయన్నారు. అమ్మవారి దగ్గర ప్రత్యేక పూజలను నిర్వహించి దాతలను శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశ్వర్లు, సీఎంఆర్ షాపింగ్‌మాల్ మేనేజర్ వాసులు పాల్గొన్నారు.

ఈతకెళ్లి విద్యార్థి మృతి



వెంకటాచలం: సరదాగా ఈతకు వెళ్లి విద్యార్థి మృతిచెందిన ఘటన మండలంలోని అనికేపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తురకా అనిల్‌కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు వెంకయ్య (9) అనే పిల్లలు ఉన్నారు. వెంకయ్య పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం పాఠశాల ముగిసిన తర్వాత వెంకయ్య స్థానికంగా ఉంటున్న మరో ఇద్దరు విద్యార్థులతో కలిసి గ్రామానికి సమీపాన ఉన్న సర్వేపల్లి రిజర్వాయర్ నీటి గుంత వద్దకు ఈతకు వెళ్లాడు. వెంకయ్య ముందుగా నీటిలో దిగాడు. ఒక్కసారిగా లోతైన గుంతలో మునిగిపోయాడు. గట్టుపై ఉన్న ఇద్దరు విద్యార్థులకు వెంకయ్య కనిపించకపోవడంతో గ్రామంలోకి వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పారు. గ్రామస్తులు మత్స్యకారుల చేత నీటి గుంతలో వెతికించారు. వారు వెంకయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. బాలుడి మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

డాక్టరేట్ ప్రదానం

నెల్లూరు(టౌన్): విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) విద్యార్థి వేముల రజనికి డాక్టరేట్ లభించింది. విశ్వవిద్యాలయ బయోటెక్నాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్మయి పర్యవేక్షణలో పరిశోధన చేసి గ్రంథాన్ని సమర్పించారు. ఈ క్రమంలో ఆమెకు డాక్టరేట్‌ను వీఎస్‌యూ ప్రదానం చేసింది.

రాజకీయాలకు అతీతంగా పథకాల అమలు



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: రాజకీయాలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇందుకూరుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల వారికి జరిగిన లబ్ధిని వివరించారు. సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రసన్న మాట్లాడుతూ సీఎం ప్రవేశపెట్టిన పథకాలతో ప్రజలంతా చాలా సంతోషంగా ఉన్నట్లు చెప్పారు. ప్రతి గడపకు వెళ్లి లబ్ధిని వివరిస్తుంటే ఇప్పటి వరకు ఏ ప్రభుత్వంలో ఇలాంటి సంక్షేమం, ఆర్థిక భరోసాను చూడలేదని ప్రజలు చెబుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ ఆశయంతో గడప గడపకు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారో అది నెరవేరేలా రెట్టింపు ఉత్సాహంతో జరుగుతోందన్నారు. అర్హతే కొలమానంగా పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ఎటువంటి సందేహం లేదన్నారు. కొన్ని ప్రాంతాల్లో టీడీపీ మద్దతుదారులు కూడా మా ప్రభుత్వంలో ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలు చూడలేదని చెబుతున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పథకాలు పొందడం ఆనందంగా ఉందని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చిందన్నారు. లబ్ధిదారులంతా జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకునే విధంగా అవగాహన కల్పిస్తున్నారన్నారు. పొదుపు సభ్యులైతే వారికి సంఘ బంధం తరఫున రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ నాగేంద్రబాబు, సీఐ రామకృష్ణారెడ్డి, నాయకులు భాస్కర్‌నాయుడు, అద్దంకి రాజా, వాసు, చక్రి, సర్పంచ్ పద్మావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



ముత్తుకూరు: పిల్లలకు వైద్య పరీక్షలు చేయించిన తల్లులు



మనుబోలు: చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్

మనుబోలు: చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చిన్న పిల్లల ప్రభుత్వ వైద్యురాలు గ్రేస్ ఎస్తేర్ తెలిపారు. మనుబోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఐదేళ్లలోపు చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించారు. మండలంలో 209 మంది చిన్నారులు ఉండగా వారిలో 68 మందిని పరీక్షించామన్నారు. 36 మందిలో పోషకాహార లోపం ఉన్నట్లుగా గుర్తించి ఎన్‌ఆర్‌సీకి తరలించినట్లు తెలిపారు. కార్యక్రమలో సీహెచ్‌ఓ రాజయ్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్ ద్వారా..

ముత్తుకూరు: స్పెషల్ డ్రైవ్ ద్వారా మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నపిల్లలకు శుక్రవారం ముత్తుకూరులోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. 65 మంది చిన్న పిల్లలకు సంబంధించి ఎత్తు, బరువు, పోషణ తదితర అంశాలపై వైద్యులు మాళవిక, దేవి కృప, చందనప్రియ తదితరులు వైద్య పరీక్షలు చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, సూపరవైజర్లు లలితాంబ, సుబ్బమ్మ, మంజుల, తల్లుల ద్వారా పిల్లల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకున్నారు. వారికి అవసరమైన మందులు అందజేశారు.

రూపాయి ఖర్చు లేకుండా వైద్యం



శిశువును చూపుతున్న డాక్టర్ పద్మావతి

పొదలకూరు: రూపాయి ఖర్చు లేకుండా పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం చేస్తున్నట్లు గైనకాలజిస్ట్, వైద్యాధికారి డాక్టర్ పద్మావతి తెలిపారు. ఓ గర్భిణికి కాన్పు కష్టం కావడంతో సిజేరియన్ చేసి తల్లీబిడ్డను కాపాడామన్నారు. శుక్రవారం వివరాలు వెల్లడించారు. మండలంలోని డేగపూడి గ్రామానికి చెందిన మమత గతంలో తొలి కాన్పు కోసం నెల్లూరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లింది. కాన్పు కష్టంగా మారి బిడ్డ పుట్టి ఐదురోజులకే మృతిచెందింది. రెండో పర్యాయం గర్భం దాల్చినప్పటి నుంచి సీహెచ్‌సీలోనే వైద్య పరీక్షలు చేయించుకుంటోంది. శుక్రవారం ఆమె కాన్పు కోసం వచ్చింది. ఉమ్మనీరు అధికంగా ఉండి కాన్పు కష్టంగా మారడంతో డాక్టర్ పద్మావతి సిజేరియన్ చేసి తల్లీబిడ్డను కాపాడారు. ఈ మేరకు జనన ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. సీహెచ్‌సీ ఏర్పాటైన తర్వాత తొలిసారిగా సిజేరియన్‌ను విజయవంతంగా చేసినట్లు డాక్టర్ వెల్లడించారు. రుపాయి ఖర్చు లేకుండా మమతకు ఆపరేషన్ చేశారు. ఇందుకు సహకరించిన వారిలో అనస్తీషియా డాక్టర్ ప్రసాద్, అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ వెంకటశివకృష్ణ, హెడ్ నర్స్ పద్మాంజలి, స్టాఫ్ నర్స్ రాజ, యామిని, ఓటీ అసిస్టెంట్ నూరుల్లా ఉన్నారు.

నాణ్యమైన వైద్యం

గత ప్రభుత్వంలో సీహెచ్‌సీని ఏర్పాటు చేసి భవనం నిర్మించినా ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ఇక్కడ శస్త్రచికిత్సలు జరిగేవి కాదు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అన్ని రకాల పరికరాలను కొనుగోలు చేయించారు. ఇంకా అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు నాడు – నేడు పథకం కింద ఆరోగ్య కేంద్రాలను బాగు చేయడంతో పేదలకు నాణ్యమైన వైద్యం అందుతోంది.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



కొడవలూరు ఎన్టీఆర్ కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొడవలూరు: మూడేళ్లు నిండిన చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, అక్కడ వారికి ఆటపాటలతో కూడిన విద్యనందించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి తెలిపారు. మండలంలోని కొత్తవంగల్లు మజరా చీకిరేణిగుంట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జనభాగీదారి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారని, దీంతో వారు ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, సుప్రజ, భారతి, కుమారి, కామేశ్వరి పాల్గొన్నారు.

- కొడవలూరులో ఎన్టీఆర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జన భాగీదారి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఎస్.నిర్మల మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రీస్కూల్ పిల్లలను గుర్తించి అంగన్‌వాడీల్లో పేర్లు నమోదు చేయించడంతోపాటు కేంద్రానికి వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎస్‌డీ యాసిన్ పాల్గొన్నారు.

పేలిన ట్రాన్స్‌ఫార్మర్

- మంటలు వ్యాపించి గడ్డివామి దగ్ధం



మంటల్లో కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్

పొదలకూరు: పట్టణంలోని రామమందిరం వీధి విజ్ఞాన్ జూనియర్ కాలేజీకు సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ శుక్రవారం పేలింది. దీంతో మంటలు వ్యాపించి పక్కనే గడ్డివామి కూడా దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. రామ మందిరం, తొగటవీధికి విద్యుత్‌ను సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ మధ్యాహ్నం సమయంలో ఒక్కసారి పేలిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంటలు సమీపంలో ఉన్న గడ్డివామికి వ్యాపించాయి. సమాచారం అందుకున్న పొదలకూరు అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏడీఈ సురేంద్రబాబు మాట్లాడుతూ ఎండవేడిమికి ట్రాన్స్‌ఫార్మర్ పేలినట్లుగా భావిస్తున్నామన్నారు. సాధారణంగా ఎంతగా ఎండఉన్నా ట్రాన్స్‌ఫార్మర్లు పేలవని, అయితే ఇక్కడ ఎందుకు పేలి మంటలు వ్యాపించాయో తెలుసుకుంటామన్నారు.